## ప్రవీణ్ కుటుంబానికి కేటీఆర్ ఓదార్పు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అమెరికాలో దుండగల చేతిలో హత్యకు గురైన ప్రవీణ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓదార్చారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమెరికా వెళ్ళిన షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం గంప రాఘవులు కుమారుడు గంప ప్రవీణ్‌ను దుండగులు హతమార్చడం పట్ల ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులకు కేటీఆర్ తన సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ స్థానిక నేత రవీందర్ యాదవ్ ఫోన్ ద్వారా స్పందించి బాధితుని కుటుంబంతో ఫోన్లో మాట్లాడారు. జరిగిన దారుణం చాలా బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలని, గంప ప్రవీణ్ మతదేహాన్ని వీలైనంత తొందరగా భారతదేశానికి రప్పించేందుకు భారత రాయబార కార్యాలయంతో మాట్లాడతానని చెప్పారు.


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక


## ప్రేమ జంట ఆత్మహత్య

కరీంనగర్ :అమృత్ తెలంగాణ: ప్రేమించుకున్న ఆ జంట పెండ్లితో ఒక్కటవ్వాలని కలలు కన్నారు. కానీ కుటుంబ పెద్దల నిరాకరణతో ఇద్దరూ ప్రాణం తీసుకున్నారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. చొప్పదండి మండలం చిత్యాలపల్లి గ్రామానికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్(24), భూపాలపట్నం గ్రామానికి చెందిన నాంపల్లి అలేఖ్య(22) రెండేండ్లుగా ప్రేమలో ఉన్నారు. అలేఖ్య తల్లిదండ్రులు ఆమెకు మరో సంబంధం ఖరారు చేసి, పెండ్లి చేసుకోవాలని ఆమెపై ఒత్తిడి తీసుకువచ్చారు. అలేఖ్య తనకు దూరమవుతుందని ఆందోళనకు గురైన అరుణ్ గురువారం సాయంత్రం తన స్నేహితుడి ఇంటికి అలేఖ్యను తీసుకెళ్లాడు. అక్కడ వారిద్దరూ చివరిసారిగా మాట్లాడుకున్న అనంతరం గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.


సంపుటి: 01 సంచిక : 160. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.07.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00


# ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన ముసాయిదా బిల్లులకు క్యాబినెట్ ఆమోదం

**డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష సమావేశం**
**10,950 విలేజ్ లెవెల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి ఒకే**
**ఎఫ్‌సీడీఏ, యాదగిరి గుట్ట బోర్డులకు ఆమోదం**
**మహిళా సంఘాల సభ్యత్వానికి వయో పరిమితి పెంపు**
**బీసీలకు 42శాతం రిజర్వేషన్లు**
**ఆరు గంటల పాటు సుదీర్ఘంగా మంత్రివర్గ సమావేశం**
**క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం**
**11 జిల్లాలు 104 మండలాలు, 1355 గ్రామాలతో హెచ్ఎండీఏ విస్తరణ**




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన ముసాయిదా బిల్లులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నియోజకవర్గాల పునర్విభజనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్ణయించి, అందులో వచ్చే అభిప్రాయాలను కేంద్రానికి నివేదించాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన క్యాబినెట్ ఆరు గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రివర్గంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరాలను వెల్లడించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణపై కీలక నిర్ణయం తీసుకున్నామని పొంగులేటి ఈ సందర్భంగా తెలిపారు. దానిపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని గంటల్లోనే అసెంబ్లీలో ప్రవేశపెడతామంటూ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌తోపాటు మంత్రి మండలి సబ్ కమిటీ ఇచ్చిన మధ్యంతర నివేదికపై 72 సూచనలు వచ్చాయన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి న్యాయపరమై న చిక్కులు రాకుండా ఉండేందుకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణపై చట్టం తేవాలని క్యాబినెట్‌లో నిర్ణయించామన్నారు. తెలంగాణను మూడు కోర్ ఏరియాలుగా విభజించామనీ, ఓర్ఆర్ఆర్ నుంచి 2 కిలో మీటర్ల వరకు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వివరించారు. కొత్తగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేయాలని క్యాబినెట్ తీర్మానించిందని తెలిపారు. అందుకు అవసరమైన 90 పోస్టులను భర్తీ చేసేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగల్ ఇచ్చిందన్నారు. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)ను 11 జిల్లాలు, 104 మండలాలు, 1,355 గ్రామాలకు విస్తరించాలని క్యాబినెట్‌లో నిర్ణయించినట్టు పొంగులేటి ఈ సందర్భంగా తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే సంకల్పంతో 'మహిళా శక్తి 2025' పాలసీకి ఆమోదం తెలిపామని చెప్పారు. 'సెర్ప్, మెప్మా విభాగాలను ఒకే గొడుగు కిందకు తేవాలని నిర్ణయించాం. డ్వాక్రా గ్రూపు సభ్యుల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 65 ఏండ్లకు పొడగించాం. సభ్యుల కనిష్ట వయస్సును 18 ఏండ్ల నుంచి 15 ఏండ్లకు కుదించాం. యాదగిరి గుట్ట అభివృద్ధి కోసం టీటీడీ తరహాలో 'యాదగిరి లక్ష్మినర్సింహ స్వామి బోర్డు' ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. ఇందుకోసం 1987 దేవాదాయ చట్టాన్ని సవరించాం. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం 'తెలంగాణ టూరిజం పాలసీ 2025–30'ని అమోదించాం. రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. రాబోయే 5 ఏండ్లల్లో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 3 లక్షల మందికి ఉపాధి కల్పించటమే లక్ష్యంగా విధివిధానాలను రూపొందించాం. హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. గతంలో ప్రతి గ్రామానికి ఒక వీఆర్ఏ, ఒకటి రెండు గ్రామాలకు కలిపి వీఆర్వోలు ఉండేవారు. వారి స్థానంలో రాష్ట్రంలోని 10,950 గ్రామాలకు విలేజ్ లెవెల్ ఆఫీసర్స్ పోస్టులను క్యాబినెట్‌లో ఆమోదించాం. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 361 పోస్టులను భర్తీ చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. గందమల్ల రిజర్వాయర్ కెపాసిటీని 4.28 టీఎంసీల నుంచి 1.41 టీఎంసీకి తగ్గించాలని నిర్ణయించాం. 2025 పారా ఒలంపిక్ కాంస్య విజేత దీప్తి దివాంజికి ఉద్యోగం కల్పించాలని నిర్ణయించాం. రెసిడెన్షియన్ స్కూళ్లలో కొత్తగా 330 పోస్టులను భర్తీ చేయాలని తీర్మానించాం' అని పొంగులేటి వివరించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్ విభజించేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజల మనోభావాలను కేంద్రానికి తెలపాలని నిర్ణయించామని అన్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తొలి విడత కుల గణన సర్వేలో పాల్గొనని వారి కోసం రెండోసారి అవకాశమిచ్చామని గుర్తు చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రెండు వేర్వేరు తీర్మానాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదిస్తామని తెలిపారు.

# డీఎస్సీ-2003 టీచర్లకు ఓపీఎస్ వర్తింపజేయండి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వర్తింపజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారనీ, ఓపీఎస్‌ను వర్తింపజేసేందుకు అంగీకరించారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డిని శాలువాతో సీఎం సత్కరించి అభినందించారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలననుసరించి పాత పెన్షన్ విధానాన్ని వర్తింప జేయాలని కోరారు. దీనిపై అధికారులతో పరిశీలింపజేసి ఆదేశాలను జారీ చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందింపజేసి ఉన్నతస్థాయి పదోన్నతులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలో ఖాళీలు ఏర్పడగానే విద్యార్థులు నష్టపోకుండా వెంటనే పదోన్నతులిచ్చేలా ఉన్న జీవో 67ను పునరుద్ధరించాలని కోరారు. 12 ఏండ్లు పూర్తయిన స్కూల్ అసిస్టెంట్, 24 ఏండ్లు పూర్తయిన ఎస్జీటీల అర్హతలను పరిశీలించి గెజిటెడ్ హోదా కల్పించాలని సూచించారు. అన్నింటినీ పరిశీలింపజేసి ఆదేశాలను ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తానని శ్రీపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి వెంకట్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలి




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. మహిళల పాత్ర అన్ని రంగాల్లోనూ 50శాతం దాటితేనే అభివృద్ధి సాధ్యమని అభిప్రాయ పడ్డారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ వివాంటలో 'గనుల రంగంలో మహిళల భాగస్వామ్యం- వివిధ రంగాల్లో మహిళల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..2047లో వికసిత భారత్ కలను నెరవేర్చేందుకు బాటలు వేస్తూ ఈ దేశ ఆడబిడ్డలు చరిత్ర సృష్టిస్తున్నారని కొనియాడారు. సమాజంలోని ప్రతి అడుగులో మహిళల శక్తికి గుర్తింపు నివ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నొక్కి చెప్పారు. ఉన్నత విద్యలో మహిళల అడ్మిషన్లు 28 శాతానికిపైగా, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో 43 శాతానికిపైగా పెరిగాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి సోదాహరణంగా వివరించారు. ప్రస్తుతం భారతదేశంలోని ఎయిర్ ఫోర్స్ పైలట్స్‌లో 15 శాతం మంది మహిళలే ఉన్నారనీ, మనదేశానికి దరిదాపుల్లో ఏదేశమూ లేదని చెప్పారు. మహిళలు అండర్ గ్రౌండ్ మైన్‌లలో కూడా పని చేసేందుకు అనుమతులిచ్చామని తెలిపారు. సింగరేణిలో మహిళల భాగస్వామ్యం పెరగబోతున్నదని చెప్పారు. కోలిండియాలో జ్యోతి ఉమెన్ లీడర్ షిప్ కార్యక్రమం ద్వారా మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వడం సంతోషకరమన్నారు. మైనింగ్ రంగంలో అధికారుల నుంచి కార్మికుల వరకు 100 శాతం మహిళలే ఉండేలా చర్యలు తీసుకోవాలని బొగ్గు, గనుల శాఖను, కోలిండియాను ఆదేశించానని చెప్పారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుందనేది తన నమ్మకమన్నారు. మైనింగ్ రంగంలో పనిచేసే వారికి కోటి రూపాయల మేర హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మైనింగ్ రంగానికి మహిళా అంబాసిడర్‌ను నియమించనున్నట్టు తెలిపారు. ప్రపంచంలోనూ, దేశంలోనూ మైనింగ్ రంగంలో మహిళల భాగస్వామ్యం ఎనిమిది నుంచి 10 శాతం లోపే ఉందనీ, మైనింగ్ రంగంలో మహిళలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) నొక్కి చెప్పారు. సమాన పనికి సమాన వేతనం కోసం మహిళలు ఫైట్ చేస్తున్నారని గుర్తుచేశారు. మహిళలకు అవకాశమిస్తే ఆకాశమే హద్దుగా రాణిస్తారని చెప్పారు. అంతరిక్షంలోనే కాదు భూగర్భంలో కూడా మహిళలు పనిచేయగలరని కొనియాడారు. సమాజ కట్టుబాట్ల వల్ల మహిళలు ముందడుగు వేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపైనా, ప్రభుత్వ పెద్దలపైనా ఉందన్నారు. మహిళా సంక్షేమం, శ్రేయస్సు కోసం కేంద్ర ప్రభుత్వం ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు.

# అడుగడుగునా ప్రభుత్వాన్ని నిలదీస్తాం

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో మాపై బాధ్యత పెరిగింది

### సమస్యలపై చర్చలకు సిద్ధమే.. పనికిరాని మాటలకు కాదు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయంతో తమపై మరింత బాధ్యత పెరిగిందనీ, ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రెఫరెండమా? వైఫల్యమా? అనే దానిపై సమీక్షించుకోవాలని సూచించారు. కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపొందిన అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్యలతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విజయోత్సవాలను నిర్వహించారు. అనంతరం ప్రెస్‌మీట్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్, కాంగ్రెస్ తోడు దొంగలనీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలెవరి వైపో స్పష్టంగా అర్థమైందని చెప్పారు. సేవ్ తెలంగాణ..సపోర్టు బీజేపీ నినాదంతో ముందుకెళ్తామన్నారు. బీజేపీ అభ్యర్థుల విజయం తెలంగాణ సమాజం, ఆత్మబలిదానాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులకే అంకితమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే బీజేపీని ఆదరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అధికారంలోకి వచ్చాక మోసం చేయడం, తప్పుడు ఆరోపణలు, వితండవాదం, తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. అయినా ప్రజలు సీఎం మాటలు, ఆరోపణలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలనైనా హామీలను నెరవేర్చక ఎదురుదాడికి దిగుతున్నారనీ, బీజేపీపై ఆరోపణలను నెడుతున్నారని విమర్శించారు. పదేండ్లు తమదే అధికారం అంటున్న కాంగ్రెస్ నేతలకు ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే సంస్థాగతంగా మరింత పటిష్టమవుతున్నామని చెప్పారు. రానున్న ఒకటి రెండు నెలల్లోనూ అన్ని కమిటీలను పూర్తి చేసుకొని రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలతో కలిసి ప్రజా పోరాటాలకు సమాయత్తం అవుతామని చెప్పారు. తెలంగాణ ప్రజల్లో మొదలైన వ్యతిరేకతను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు గుర్తించాలన్నారు. సమస్యలపై చర్చించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. పనికిరాని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు. మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఓడించి రిటర్న్ గిఫ్ట్ ఇస్తారని చెప్పారు.

# సామాజిక సేవ ముసుగులో మోసాలు



ధూల్‌పేట్ :అమృత్ తెలంగాణ: డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ అలాట్‌మెంట్ లెటర్స్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల(నకిలీ) రబ్బర్ స్టాంప్‌లు, ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, రూ.లక్షతో పాటు సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను ఛత్రినాక, సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాకకు చెందిన ఎం.జ్యోతి, పి.సునీల్ సింగ్ సోషల్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారు. స్థానికులకు ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేవారు. అయితే అందులో ఆశించినంత మేర ఆదాయం రాకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి లక్షల్లో వసూళ్లు చేయొచ్చని పథకం వేశారు. సంతోష్‌నగర్‌లో కిరాణ దుకాణం యజమాని జి.రమేష్, ఛత్రినాకకు చెందిన ఎల్.నితిన్ కుమార్‌తో కలిసి ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో అమాయకులను టార్గెట్ చేశారు. వారికి డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇప్పిస్తామని నమ్మించారు. దరఖాస్తుదారులు ఒక్కొక్కరి నుంచి రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు వసూలు చేశారు. నమ్మకం కలిగించే విధంగా వారిని మినిస్టర్ క్వార్టర్స్, సచివాలయానికి తీసుకెళ్లే వారు. వారిని బయట కూర్చోబెట్టి మంత్రులు, అధికారులతో పరిచయాలున్నట్టు చెప్పేవారు. జీహెచ్ఎంసీ, ఎమ్మార్వో కార్యాలయంతో పాటు కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలకు తీసుకెళ్లేవారు. అది చూసిన దరఖాస్తుదారులు వారిని పూర్తిగా నమ్మేవారు. ఇదే తరహాలో రెండేండ్ల నుంచి దాదాపు రెండు వందల మందికి పైగా దరఖాస్తుదారులను మోసం చేశారు. అనుమానం రాకుండా కొంతమందికి ఇండ్లకు సంబంధించి (నకిలీ) అలాట్‌మెంట్ లెటర్స్‌ను ఇచ్చారు.

# కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్



మహబూబ్‌నగర్ :అమృత్ తెలంగాణ: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల ఆచూకీ కోసం కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్‌ను రప్పిస్తున్నారు. ప్రమాదం జరిగి 13 రోజులైనా కార్మికుల జాడ తెలియడం లేదు. రెస్క్యూ టీంలు ప్రాణాలకు తెగించి పని చేస్తున్నాయి. కార్మికుల కోసం చేయని ప్రయత్నాలంటూ లేవు. సిబ్బందికి రోజుకో సమస్య ఎదురవుతోంది. లోపల శానిటేషన్ సమస్య తలెత్తుతోంది. ఊట నీరు, మట్టి పేరుకు పోయి ప్రమాద స్థలం కాంక్రీట్‌గా మారింది. దీంతో మట్టిని వెలికి తీయడం కష్టంగా మారింది. టీబీఎం మిషన్ దగ్గర సొరంగం కూలుతుందనే భయాందోళన నెలకొంది. అందుకే ప్రభుత్వం రోబో టెక్నాలజీతో కార్మికులను రక్షించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఎన్వీ రోబో టెక్నాలజీ బృందాలను సొరంగంలోకి పంపి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఏ పనికి ఎటువంటి రోబో వాడాలో నిశితంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రోబోలు రంగంలోకి దిగుతాయి. ఐటీ నిపుణుల బృందంతో టన్నెల్‌లోకి వెళ్లిన సింగరేణి, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అక్కడి పరిస్థితులను పరిశీలించి కార్మికులను వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నాయి. పరిస్థితులను ఎప్పటికప్పుడూ గమనిస్తూ సహాయక బృందాలకు దిశానిర్దేశం చేస్తున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ పర్యవేక్షణలో నిర్విరామంగా పనులు సాగుతున్నాయి. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని గుర్తించేందుకు కేరళ నుంచి ప్రత్యేకంగా క్యాడవర్ డాగ్స్‌ను రప్పిస్తున్నట్టు అరవింద్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం టన్నెల్ వద్ద జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఐటీ నిపుణులు, సింగరేణి సాంకేతిక నిపుణులు, సైనిక అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

# హోలీ కోసం ప్రకృతి అందించిన వరం.... మోదుగ పూల రంగులు





విరబూసిన మోదుగ పూలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చి 6 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి అడవి ప్రాంతంలో మోదుగ పూలు (పలాష) కోకిలమ్మన లాంటి అందంతో విరబూస్తున్నాయి. వేసవి ఆరంభంలో ప్రకృతి కనువిందుగా మారే ఈ పూలను హోలీ పండుగలో సహజ వర్ణాల తయారికి వినియోగిస్తారు. హిందువుల పండుగ అయిన హోలీ సందర్భంగా, సంప్రదాయంగా మోదుగ పూలను ఆరబెట్టి పొడిచేసి, వాటి నుండి సహజమైన ఎరుపు రంగును తయారు చేస్తారు. ప్రతి ఏటా హోలీ పండుగ దగ్గరపడుతున్న కొద్దీ, ఈ పూలకు ప్రత్యేక గుర్తింపు వస్తుంది. ప్రకృతి ప్రేమికులు, / పర్యాటకులు ఈ అందాన్ని ఆస్వాదిస్తూ, సంప్రదాయ పద్ధతుల్లో రంగుల వేడుకను జరుపుకోవాలని పిలుపునిస్తున్నారు.....

# సంబరాల్లో బిజెపి కార్యకర్తలు

## విజయోత్సవ ర్యాలీ సంబరాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న బిజెపి కార్యకర్తలు.....



నర్సాపూర్ జి లో ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలు జరుపుకున్న బిజెపి కార్యకర్తలు





నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 6 అమృత్ తెలంగాణ నర్సాపూర్, మండల కేంద్రంలో గురువారం మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ గా అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, విజయం సాధించినందుకు, లివిజయోత్సవ సంబరాలు నిర్వహించడం జరిగింది..6పార్లమెంట్ లు, 42అసెంబ్లీ లు, 13జిల్లాలు, 217మండలాలలో మొజారిటీ సాధించి ఎక్కడ ఉంది బిజెపి అన్న వారికి ఓటు తో సమాధానం చెప్పడం జరిగిందని మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, అన్నారు.. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి రాజేందర్, కౌన్సిల్ మెంబెర్ వినోద్ రెడ్డి, మండల నాయకులు అర్జున్ సింగ్,శ్రీకాంత్ రెడ్డి,మహేశ్, దత్తురాం, సవీన్,ప్రవీణ్ పటేల్,పల్లపు రాజు,నరేష్, సంతోష్, ప్రవీణ్, లక్ష్మణ్, విజయ్, బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జి లు , ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కళా పోటీలు 2024లో ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన గాధరి చంద్రశేఖర్ ప్రశంసా అవార్డును అందుకున్నారు.







అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ భారతదేశంలో కళాకారులు మరియు 5 దేశాలకు పైగా NRIల మధ్య నిర్వహించిన సెషన్ 16వ అంతర్జాతీయ కళా పోటీలు 2024లో ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన గాధరి చంద్రశేఖర్ ప్రశంసా అవార్డును అందుకున్నారు. ఇన్నోవిజే గ్లోబల్ టాలెంట్ సెర్చ్ ర్యాంక్ స్లాట్ ప్రకారం I.A.C నుండి డ్రాయింగ్ మరియు పెయింటింగ్ విభాగంలో ది మెడల్ ఆఫ్ అప్రిషియేషన్ మరియు ది లెటర్ ఆఫ్ రికగ్నిషన్ లెవల్ 2 లో ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నందుకు వారు అర్హులైన కళాకారులలో ఒకరిగా ప్రకటించబడ్డారు. ఈ అవార్డును అందుకున్నందుకూ గాను మిత్రులు బంధువులు శ్రేయోభిలాషులు వారికి అభినందనలు తెలిపారు.

# నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ కు ఘనంగా సన్మానం

## మండల కేంద్రంలో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లిన సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్స్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సప పండరి,



నూతన పదవి బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ ను సన్మానిస్తున్న కుబిర్ మండల నాయకులు

నిర్మల్ జిల్లా కుబీర్ మార్చ్ 6 అమృత్ తెలంగాణ కుబీర్ మండలానికి నూతన బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ ఎన్విఎస్ జె రామ్ చందర్, కు సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి, భైంసా మండల లీగల్ కన్వీనర్ గంధముల్ల ప్రకాష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సాప పండరి తహసిల్దార్ గారితో గ్రామస్తుల సమక్షంలో మాట్లాడుతూ గ్రామంలోని ప్రధానమైన రెవెన్యూ సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరగా, తహసిల్దార్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సల్ల గణేష్, ప్రవీణ్, మారుతి, ఒరడి సాయినాథ్, గోరేఖర్ ప్రకాష్, రావుల విట్టల్, బార్ద సాయినాథ్, బాల సురేష్, పెంటాజీ, బందు గడపాలే పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి పై అగ్రహించిన ఎంపీఓ

కుబీర్ :అమృత్ తెలంగాణ: గ్రామ పంచాయతి లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా ఇష్టనురీతిలో వ్యవరించిన పల్సి గ్రామ పంచాయతీ కార్యదర్శి పై మండల పంచాయతీ అధికారి మోహన్ సింగ్ అగ్రహించారు.దింతో గురువారం మండలంలోని పల్సి గ్రామ పంచాయతీని సందర్శించగా గ్రామంలో ఎక్కడ చుసిన చెత్త చెదారం తో మురికి కాలువలు, నిండిపోవడం చూసి ఎంపీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. దింతో షేగ్రీగెషన్ షెడ్, శనిటేషన్ నర్సరీ, లను పరిశీలించగా పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దింతో రెండు రోజులో గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారం కాకుంటే పంచాయతీ కార్యదర్శి పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నార. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో గ్రామమలో మంచి నీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది దింతో ముందుగా సమస్య రాకుండా చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడలని అన్నారు. అదే విదంగా 100శాతం ఇంటి పన్ను వసూల్ చేసేలా చూడలన్నారు.ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పాండురంగ్ సింగ్ సిబ్బంది ఉన్నారు





# విద్యుత్ కార్యాలయంలో ఏసీబీ దాడులు..





ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ విద్యుత్ శాఖ ఏడి శ్యాంప్రసాద్

అమృత తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ విద్యుత్ కార్యాలయం పై ఏసీబీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విద్యుత్ ఏడీ శ్యాంప్రసాద్ దండు మల్కాపురంలోని ఓ కంపెనీలో సోలార్ ప్రాజెక్టు అప్రూవల్ కోసం రూ.70,000 డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ సమాచారం అందడంతో ఏసీబీ అధికారులు ఒక ప్రణాళికతో రెడ్ హ్యాండెడ్ గా అధికారిని పట్టుకున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

# జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సమీక్షా సమావేశం

భువనగిరి : అమృత్ తెలంగాణ: జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు ఎండి అవైస్ ఉర్ రెహమాన్ చిస్తి ఆధ్వర్యంలో గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు తగు సూచనలు చేసినారు ఉద్యోగులు సమయపాలన పాటించాలని కోరారు. గ్రంథాలయాలు ఉదయం సాయంత్రం పనివేళలో తెరిచి ఉండవలెనని తెలిపినారు స్థానిక గ్రామపంచాయతీల నుండి గ్రంథాలయ సెస్సు వసూలుకు కృషి చేయవలెనని తెలిపారు. గ్రంథాలయాలలో నూతన సభ్యులను చేర్పించవలెనని తెలిపారు. త్వరలో మోత్కూరు, బొమ్మలరామారం శాఖ గ్రంథాలయాలకు నూతన ఫర్నిచర్ కొనుగోలు చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెడతామని తెలిపారు. రీడర్స్ కోరిన పుస్తకాలను కొనుగోలు చేయుటకు ప్రతి గ్రంథాలయములో ఆన్ డిమాండ్ రిజిస్టర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రంథాలయాల పరిసరాలను గ్రంథాలయం లోపల పరిశుభ్రంగా ఉంచవలనని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం సుధీర్ జిల్లాలోని వివిధ మండలాలలోని శాఖ గ్రంథాలయాలలో పనిచేయుచున్న గ్రంథాపాలకులు పార్ట్ టైం వర్కర్స్. పార్ట్ టైం స్వీపర్స్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# బ్లూ కోర్టు విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

## :- మహిళలకు ఆదర్శంగా నిరుస్తున్న మహిళ కానిస్టేబుల్ లు

నిర్మల్ జిల్లా నరసాపూర్ జి మార్చ్ 6 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్లో విధి నిర్వహణలో భాగంగా పురుషులతో సమానంగా మేమేం తక్కువ కాదంటూ బ్లూ కోర్ట్ మరియు పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తు మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న మహిళా కానిస్టేబుళ్లు షహన భాను, వినీత . మండల ప్రజలు వీరు నిర్వహిస్తున్న విధులను చూసి వీరిని అభినందిస్తున్నారు





బ్లూ కోర్టు విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ లు

# తల్లిదండ్రులు పిల్లలను ఒక కంటితో కనిపెడుతూ ఉండాలి

సిద్ధిపేట :అమృత్ తెలంగాణ: గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ఒక కంటితో కనిపెడుతూ ఉండాలని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు కోరారు. గురువారం గంజాయి ఇతర మత్తుపదార్థాల నివారణ గురించి నార్కటిక్స్ డాగ్స్ అనుమానస్పద ప్రాంతాలలో తనిఖీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటల్స్, పాన్ షాప్స్ కిరాణా షాపులలో, ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే, అమ్మిన, విక్రయించిన వెంటనే డయల్ 100, తెలంగాణ యాంటీ నార్కటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908, తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ సిబ్బంది, సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# "కులగణన పై అవగాహన – వివిధ రాజకీయ పార్టీల కుట్రలు"


అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ ఇందిరా భవన్ లో 11న 2.గ.కులగణన పై వివిధ రాజకీయ పార్టీ కుట్రల పై సెమినార్ ఆదివాసి కాంగ్రెస్, టిపిసిసి ఆధ్వర్యంలో మార్చ్ 11న, మధ్యాహ్నం 2 గంటలకు ఇందిరా భవన్ లో "కులగణన పై అవగాహన – వివిధ రాజకీయ పార్టీల కుట్రలు" అనే అంశంపై సెమినార్ ప్రధాన వక్త : ప్రొఫెసర్ కంచ ఐలయ్య ముఖ్య అతిథి: శ్రీ మహేష్ కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షులు సభ అధ్యక్షత : డాక్టర్ బెల్లయ్య నాయక్, చైర్మన్, ఆదివాసి కాంగ్రెస్. అందరూ ఆహ్వానితులే బాణావత్ గోవింద్ నాయక్ ఆదివాసి కాంగ్రెస్ నిర్మల్ జిల్లా చైర్మన్



## బిజీ బిజీగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ దస్నాపూర్ వాస్తవ్యులు కేంద పోశెట్టి గారి కుమారుడు మహేష్ వివాహానికి, మావల కు చెందిన బొజ్జ గంగన్న కుమారుడు అజయ్ వివాహానికి, శాంతి నగర్ కు చెందిన నక్క రాందాస్ కుమారుడు గణేష్ వివాహానికి, మహాలక్ష్మివాడ కు చెందిన గండ్రత్ వెంకటి కుమార్తె ప్రియాంక వివాహానికి హాజరై హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి .. వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నలిమెల నవీన్ రెడ్డి, మావల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్ , యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, టౌన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి, రేండ్ల రాజన్న, రాజు కుమార్, సవీన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎల్.ఆర్.ఎస్ 2020 స్కీమ్ క్రింద ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారుల కొరకు ప్రభుత్వం 25 శాతం రిబేట్ తో కూడిన చెల్లింపు విధానాన్ని తెచ్చినందున





హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణ ఫీజును మార్చి నెలాఖరు లోపు చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని ఈ విషయాన్ని ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులకు వివరిస్తూ, రిబేట్ సదుపాయం సద్వినియోగం చేసుకునేలా చూడాలని గురువారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన LRS సమావేశం లో లే అవుట్ యజమానులు, డెవలపర్స్, మున్సిపల్, పంచాయితి, రిజిస్ట్రేషన్, రెవెన్యు అధికారులతో జిల్లా పాలనాధికారి రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి తో కలిసి సమావేశం నిర్వహించి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనధికార లేఅవుట్ క్రమబద్ధికరణ కు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఈ నెల 31 వ తేదీలోగా చేసుకుంటే 25 శాతం రాయితీ ఇస్తుందని జిల్లాలోని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ – 2020 క్రింద రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు వచ్చాయని. గత సెప్టెంబర్ 2024 లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ అయింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుంది. ఎల్ఆర్ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో నాలుగు వేలకు పైగా మున్సిపల్, మూడు వేల కు పైగా గ్రామ పంచాయితీ లకు ఫ్రీ ఇంటిమేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. 26, ఆగస్టు 2020 సంవత్సరంలో అప్లికేషన్ చేసుకున్నవారు, పురపాలక, సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించి తమ ప్లాటును రెగ్యులైజ్ చేసుకోగలరన్నారు. సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలి. ఈ నెల 31 వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలన్నారు, ఈ కార్యక్రమంలో rdo వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సీవియన్ రాజు, dlpo ఫణీంద్ర, తదితరులు ఉన్నారు.

## జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాలశక్తి కార్యక్రమం









అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాలశక్తి కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ దస్తురాబాద్ పాఠశాలలోని విద్యార్థులకు ఎల్ డి ఎం రామ్ గోపాల్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సైబర్ సెక్యూరిటీ గురించి క్విజ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ క్విజ్ కార్యక్రమంలో మొత్తం ఐదు జట్లు పాల్గొనగా విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే పిల్లల్లో ఆర్థిక అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే తల్లిదండ్రులకు డబ్బు యొక్క పొదుపు, పెట్టుబడి, రిస్క్, దుబారా ఖర్చులు చేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ తిరుపతి, పాఠశాల సిబ్బంది, సి ఎఫ్ ఎల్ వాలంటీర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా పాటవ పోటీలతో అంతర్గత ప్రజ్ఞ బహిర్గతం: ఎంఈవో పొన్నగంటి ప్రసాదరావు





అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ప్రతీ విద్యార్థి అంతర్గతంగా ఏదో ఒక ప్రజ్ఞ కలిగి ఉంటాడని,దాన్ని బహిర్గతం చేయడంతో విద్యార్థి మేధ ను అంచనా వేయడానికి ప్రతిభాపాటవాలు పోటీలు దోహదం చేస్తాయని విద్యాశాఖ మండల అధికారి పొన్నగంటి ప్రసాదరావు అన్నారు. మండల స్థాయీ ప్రతిభా పాఠవ పోటీలను గురువారం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూ నగర్ పాఠశాలలో నిర్వహించారు. బాల మేళా లో బాగంగా ముందుగా పాఠశాల లో నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కాంప్లెక్స్ స్థాయి బాల మేళా లో పోటీ పడ్డారు. ఈ పోటీలలో మండల స్థాయికి ఎంపికైన విద్యార్థులను మండల స్థాయి ప్రతిభా పాఠ వాల లో పాల్గొన్నారు. మండల స్థాయి లో కథలు,ఉపన్యాసాలు, వ్యాసరచన లు, క్విజ్, చిత్రలేఖనం గణిత ప్రతిభా పాఠవ పరీక్ష, పాటల పోటీలు నిర్వహించారు. పోటీలలో కాంప్లెక్స్ స్థాయిలో ఎంపికై ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మండల స్థాయి ఉత్తమ పాఠశాల గా ఎంపీపీ ఎస్ నందమూరి నగర్,విద్యాపరంగా ఉత్తమ కార్యాచరణ విభాగంలో ఎంపీపీ ఎస్ నారావారి గూడెం, క్విజ్ విభాగంలో జెడ్పీ హెచ్ ఎస్ అశ్వారావుపేట బాలికల పాఠశాల కాంప్లెక్స్ లు మండల స్థాయీ ప్రథమ స్థానాల్లో నిలిచాయి.

# నా ఎంపిక-నా హక్కు

## మహిళల విద్యకు ఈనాటికి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి....



**అమృత్ తెలంగాణ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేఎల్ రాములు,**

అమృత్ తెలంగాణ ఈ రోజుల్లో యువత స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి, తమ జీవితాన్ని తమ అభిరుచులకు అనుగుణంగా నడిపించుకునేందుకు ముందుకు వస్తున్నారు. "నా ఎంపిక–నా హక్కు" అనే భావనను బలపర్చాలి. ఆత్మగౌరవంతో జీవించే హక్కును గుర్తించి అమలు చెయ్యాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మార్చి 8 సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది. విద్య, వృత్తి, జీవనశైలి, ప్రేమ ఏ విషయంలోనైనా యువత తమకు నచ్చినది ఎంచుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి. సమాజం అభిప్రాయాలను చెప్పవచ్చు. మార్గనిర్దేశం చేయవచ్చు. కానీ బలవంతంగా నియంత్రించకూడదు. వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించడం ప్రజాస్వామ్యాన్ని బలపర్చుతుంది. యువత సృజనాత్మకంగా కొత్త విషయాలను కనిపెట్టడానికి, వాటిని సమాజం ఉపయోగించుకోవడానికి దోహదపడుతుంది.

మహిళల విద్యకు ఈనాటికీ ఆటంకాలు ఎదురవుతున్నాయి. అందువల్ల పురుషులతో సమానంగా విద్యను పొందలేక పోతున్నారు. ఆర్థిక సమస్యలు, వరకట్నం, సామాజిక, సాంస్కృతిక ఆంక్షలు, పాఠశాలలు దూరంగా ఉండటం, సౌకర్యాల లేమి వంటి అంశాలు బాలికల విద్యను ప్రభావితం చేస్తున్నాయి.

మహిళల విద్యకు, విభిన్న వృత్తులు చేపట్టటానికి ఉన్న ఆటంకాలను అధిగమించేందుకు ప్రభుత్వాలు, సమాజం, కుటుంబాలు కలిసికట్టుగా పనిచేయాలి. స్త్రీలు తమ ఆసక్తులు, లక్ష్యాలను అనుసరించి ముందుకు సాగేందుకు ప్రోత్సాహం అందించాలి. ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా, సమాజ పురోగతికి కూడా కీలకం.

విభిన్న వృత్తులను ఎంచుకోవడంలో మహిళలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఒక కేసులో తీర్పునిస్తూ మహిళలు పని చేసే వాతావరణం కల్పించడం అవసరమని పేర్కొన్నది. గర్భస్రావమైన స్త్రీ మానసిక, శారీరక స్థితిని గుర్తించకుండా ఇద్దరు మహిళా జడ్జీలను తొలగించిన మధ్యప్రదేశ్ హైకోర్టును 'సుప్రీం' తప్పుపట్టింది. సాంప్రదాయంగా, మహిళలకు నిర్దిష్టమైన వృత్తులు మాత్రమే అనుకూలంగా ఉంటాయని సమాజం నిర్ణయించేసింది. అయితే, మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లోకి అడుగు పెడుతున్నారు. కానీ, కొన్ని ప్రత్యేకమైన వృత్తులను ఎంచుకోవడంలో వారు ఇంకా అనేక ఆటంకాలను ఎదుర్కొంటున్నారు.

కొన్ని వృత్తులు పురుషులకు మాత్రమే సరైనవని భావించడం వల్ల, మహిళలకు అవకాశాలు దక్కడంలేదు. పోరాట క్రీడలు, విమాన పైలట్, ఇంజినీరింగ్, పోలీసు–సైనిక శాఖలు వంటి రంగాల్లో మహిళలను ప్రోత్సహించడంలో సమాజం ఇంకా వెనుకబడి ఉంది. కొన్ని వృత్తులు శారీరకంగా కష్టతరమని భావించి, కుటుంబ సభ్యులు మహిళలను ఆ దిశగా వెళ్ళనీయరు. కుటుంబ బాధ్యతల కారణంగాను, నైతిక విలువలపై కాపలా ఉండే స్వభావం వలన "మహిళల పని ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకే ఉండాలి" అనే అపోహలు ఇంకా ఉన్నాయి.

డ్రైవింగ్, మెకానిక్ వృత్తులు, టెక్నికల్ పనులు, రాజకీయ రంగం వంటివి పురుషులకు మాత్రమే అని భావించే సాంప్రదాయ ఆలోచనలు బలంగా కొనసాగుతున్నాయి. మహిళలు ఫ్యాషన్, బ్యూటీషియన్, టీచింగ్, నర్సింగ్ వంటి కొన్ని వృత్తులకు మాత్రమే పరిమితం కావాలని సమాజం నిర్దేశించే ప్రయత్నం చేస్తుంది. మహిళలు సమాన పనిని చేసినా, కొన్ని చోట్ల పురుషుల కంటే తక్కువ జీతం అందుకుంటున్నారు. ప్రసూతి సెలవులు, పిల్లల పెంపకం వంటి అంశాల వల్ల మహిళలు వృత్తిలో వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుంది. వీటి పరిష్కారానికి కృషి చేయాలి.

పిల్లలకు చిన్నతనం నుంచే "మగ–ఆడ వృత్తులు" అనే తేడా ఉండదని నేర్పించాలి. ఆచరించాలి. భద్రతను మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలి. జీతాల్లో లింగ వివక్ష తొలగించాలి. మహిళలు ఎలాంటి వృత్తిని ఎంచుకున్నా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. మహిళలు అన్ని రంగాల్లోకి ప్రవేశించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

మహిళలపై హింస

ఉద్యోగ ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, అసభ్య వ్యవహారాలు అరికట్టే పరిస్థితి లేదు. ఇటీవల అమెరికాలో భద్రతా వ్యవస్థలో పని చేసే అధికారుల తీవ్రమైన సెక్స్ స్కాండల్ సంచలనం సృష్టించింది. మన దేశంలో, రాష్ట్రంలో కూడా స్త్రీలపై అత్యాచారాలు ఆందోళన కల్గిస్తున్నాయి. స్త్రీల శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చడం, పురుషాధిక్యత, దాని వలన పెరిగిన పోర్న్ ఈ హింసకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కఠినమైన చట్టాలు–సమర్థవంతమైన అమలు–అవగాహన–స్వీయరక్షణ–బాధితులకు మద్దతు అవసరం. ఇవి సమగ్రంగా అమలు చేసినప్పుడే మహిళలపై లైంగిక హింసను సమూలంగా అరికట్టగలం.

కులాంతర వివాహాలు

లభారతీయ సమాజం వేగంగా మారుతోంది. కానీ కొన్ని మూఢనమ్మకాలు, కట్టుబాట్లు ఇప్పటికీ యువతను అణగదొక్కుతున్నాయి. కాలం చెల్లిన కుల, మత భావనలు పెంచి పోషించబడ్తున్నాయి. ముఖ్యంగా కులాంతర వివాహాల విషయంలో తల్లిదండ్రులు, బంధువులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కొన్నిసార్లు హింసాకాండకు కూడా పాల్పడుతున్నారు. ఇది ఎంతవరకు న్యాయం?

తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన పడటం సహజమే. కానీ, కేవలం కులం భిన్నంగా ఉందని పెళ్లిని అంగీకరించకుండా, ప్రేమించిన జంటల జీవితాన్ని నాశనం చేయడం తగదు. ప్రేమ, పరస్పర అంగీకారం, నమ్మకం ఉంటేనే ఒక కుటుంబం బలంగా నిలుస్తుంది. కేవలం కులం ఆధారంగా పెళ్లి అనుకూలం లేదా అననుకూలం అనే తీర్పు నష్టం కల్గిస్తుంది.

పురోగతికి అడ్డంకి మూఢనమ్మకాలు

కులమనే వ్యవస్థ అప్పటి సామాజిక పరిస్థితులలో ఏర్పడింది. కానీ, ఈ రోజుల్లో విద్య, ఉద్యోగం, ఆధునిక జీవన విధానాల వల్ల కుల పరిమితులు పెద్దగా సంబంధం లేని అంశాలయ్యాయి. అయినా, ప్రేమను కులంతో కొలవడం వెనుకబాటుతనమే. కులాంతర వివాహాలను అంగీకరించలేక, కొందరు తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవడం, బెదిరించడం, కొన్నిసార్లు హత్యలకు కూడా పాల్పడడం తీవ్రంగా సహించరానిది. ప్రేమ వివాహం చేసుకున్నందుకు ప్రేమతో, బాధ్యతతో పెంచిన తల్లిదండ్రులే దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారే?

తల్లిదండ్రులు తమ ఆలోచనలను మార్చుకోవాలి. పిల్లలు ఎవరిని ప్రేమించాలి, ఎవరితో జీవితాన్ని పంచుకోవాలి అనే నిర్ణయం వారి స్వేచ్ఛకు వదిలెయ్యాలి. ప్రేమను కులంతో కలిపి చూడకుండా, పరస్పర గౌరవం, నమ్మకం వివాహానికి కేంద్ర బిందువుగా చూడాలి. కులాంతర వివాహాలు సమాజ పురోగతికి సూచిక. ప్రేమకు కులం అడ్డుగా నిలిస్తే, అది నష్టమే కాని లాభం కాదు. తల్లిదండ్రులు తమ పిల్లల సంతోషాన్ని, స్వేచ్ఛను గౌరవించాలి. చివరికి, ప్రేమ నెగ్గాలి –హింస కాదు!

మన రాష్ట్రంలో ఇటీవల కులాంతర వివాహాలు చేసుకున్న యువతీ యువకులు పరువు పేరిట హత్యలకు గురవుతున్నారు. ఈ ఘటనలు సమాజంలో పెరుగుతున్న కుల దురహంకారానికి నిదర్శనం. 2023 ఫిబ్రవరిలో నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని ఆలమూరు గ్రామంలో ప్రసన్న అనే యువతిని ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో వివాహం చేశారు. అయితే, పెళ్లికి ముందు ఆమె మరో యువకుడిని ప్రేమించింది. వివాహం తరువాత పుట్టింటికి వచ్చి, భర్త వద్దకు తిరిగి వెళ్లకుండా ఉండిపోయింది. కుమార్తె ప్రవర్తనతో పరువు పోయిందని భావించిన తండ్రి, ఆమెను గొంతు నులిమి చంపి, తల, మొండాన్ని వేరు చేసి, వేర్వేరు చోట్ల పడేశాడు.

2022 జూన్‌లో అనంతపురం జిల్లా కనగానపల్లి మండలంలో మరో పరువు హత్య జరిగింది. మురళి అనే యువకుడు, వీణ అనే యువతిని ప్రేమించి, వేర్వేరు కులాలకు చెందినప్పటికీ, పెద్దల అనుమతి లేకుండా వివాహం చేసుకున్నారు. ఈ వివాహాన్ని జీర్ణించుకోలేని వీణ తల్లి, ముగ్గురు యువకులను పురామాయించి మురళిని కిడ్నాప్ చేసి, అనంతరం గొంతు కోసి హత్య చేయించింది. ఆంధ్రప్రదేశ్‌లోనూ, దేశంలోనూ ఈ ధోరణులు పెరగడమే కాదు మనువాద ప్రచారాలు వీటిని పెంచుతున్నాయి. అయితే, సమాజంలో కులాంతర వివాహాలను అంగీకరించే కుటుంబాలు కూడా ఉన్నాయి. మన భారతీయ సంస్కృతి సాంప్రదాయంలో కులాంతర వివాహాలు, స్వయంవరాలు అలవాటైనవే! శకుంతల, రుక్మిణి లాంటి ఎన్నో పౌరాణిక వివాహాలు గొప్పగా కీర్తించబడ్డాయి. తమ పిల్లల ఆనందానికి, స్వేచ్ఛకు ప్రాధాన్యతనిస్తూ, కుల అంతరాలు లేని సమాజ పురోగతికి తోడ్పడం ద్వారానే సామాజిక మార్పు, సమానత సాధ్యమవుతుంది.

"చర్యలను వేగవంతం చెయ్యాలి" అని ఐక్యరాజ్యసమితి పిలుపు. అన్ని రంగాల్లో అసమానత సాధించే వైపుగా ఈ చర్యలుండాలి. పైన సూచించిన అనేక అంశాలలో సమానత సాధనకు బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యతనివ్వాలి. స్త్రీల కోసం ప్రకటించిన వాగ్దానాలను అమలు చెయ్యాలి. అంటే అందుకు తగిన కేటాయింపులు ఉండాలి. మహిళా దినోత్సవ వేడుకలు మాటలకు, కాగితాలకు పరిమితం కారాదు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఉచిత బస్సు, డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ తదితర వాగ్దానాల అమలుకు పూనుకుంటూనే విద్య, ఉపాధి, భద్రత కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

## రెండో రోజు.. ఇంటర్ ద్వితీయ సంవత్సరం




అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: బుధవారం ప్రారంభం అయిన పరీక్షలు గురువారానికి రెండో రోజుకు చేరాయి.నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముస్లిం మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాల ల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో ఈ మూడూ కళాశాల తో పాటు దమ్మపేట మండలంలోని మందలపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, దమ్మపేట లోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాల, అంకంపాలెం గిరిజన సంక్షేమ శాఖ బాలికల కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ మూడు కేంద్రాల్లో, ఆరు కళాశాల లు నుండి ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు 767 మంది హాజరు కావాల్సి ఉండగా 757 మంది హాజరు అయ్యారు.10 మంది పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. ఆయా పరీక్షల కేంద్రాలకు సీఎస్ (చీఫ్ సూపరింటెండెంట్), డీఓ(డిపార్ట్ మెంట్ ఆఫీసర్), కస్టోడియన్ లుగా అల్లు అనిత, జెడ్.ఉషా రత్నం, కే.రవీంద్రబాబు,ఎం.ఝాన్సీ లక్ష్మి, బి.సంగీత, బి.కుమారస్వామి, డి.నరసింహారావు లు విధులు నిర్వహిస్తున్నారు.

# ఇటుక బట్టీల్లో మగ్గుతున్న బాల్యం!

## ఓ ప్రభుత్వం మా పేదలను ఆదుకునేది ఎప్పుడో.?...కూలీ చేసుకున్న దాక తప్పదు..





శేరిలింగంపల్లి.అమృత్ తెలంగాణ: మార్చ్ 6. గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ నుంచి స్పష్టమైన అనుమతులు లేకుండా కొందరు ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇటుక బట్టీల్లో మగ్గుతున్న బాల్యం! పలు గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ నుంచి స్పష్టమైన అనుమతులు లేకుండా కొందరు ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇటుక బట్టీల యజమానులు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి వారి చేత వెట్టిచాకిరి చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. బట్టీలలో కార్మికుల పిల్లలు కూడా పనిచేయడం విచారకరం. బాల కార్మికుల నిర్మూలన చట్టం ఉన్నప్పటికీ ఇటుకల తయారీ కేంద్రాల వద్ద కొందరి కార్మికుల పిల్లలు పనిచేస్తూ ఆడుకుంటూ కనిపిస్తున్నారు. దుమ్ము, దూళి మధ్య బాల బాలికలు ఉ ఒడడం వల్ల వారు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. పని ప్రదేశంలో చిన్నపిల్లలు ఉండటంవల్ల వారికి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కాలంలో కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బాల కార్మిక నిర్మూలన ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అనేక మంది బాల కార్మికులను గుర్తించి వయసుల వారీగా వారందరినీ అంగన్వాడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఒక దిక్కు బాల కార్మిక నిర్మూలన స్పెషల్ డ్రైవ్ నడుస్తున్న మరో దిక్కు ఇటుక బట్టీలలో బాల్యం మగ్గడం బాధాకరం. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఇటుక బట్టిలలో బాల కార్మికులు పని చేయకుండా చేసేందుకు చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్మికుల పిల్లలకు భరోసా ఏది

ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు వారి పిల్లలకు భరోసా లేకుండా పోయింది. మహారాష్ట్ర ఒరిస్సా ఛత్తీస్గడ్ తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ కూలికి కార్మికులను తీసుకువచ్చి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఇటుక బట్టీలలో పనులు చేయిస్తున్న పరిస్థితి నెలకొంది. కార్మికుల పిల్లల సంక్షేమాన్ని ఎవరు చూస్తారని వాదన వినబడుతుంది. కొందరు బట్టీల యజమానులు లేత మొగ్గలతో ఉన్న కార్మికుల పిల్లలను తీసుకువచ్చి ఇటుక బట్టిలలో వారిని ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కార్మికులకు కనీస వేతనాలు కరువు.

లేబర్ యాక్ట్ ప్రకారం ప్రతి కార్మికుడికి రోజు కూలి రూ. 500 నుంచి 700 రూపాయలకు పైగా ఇవ్వాల్సి ఉంటుందని కొందరు కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. అయితే ఇటుక బట్టిలలో పనిచేసే కార్మికులకు మాత్రం రూ.200 నుంచి రూ.300 లోపే కూలి ఇస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు కార్మికులతో పనిచేస్తూ వారి శ్రమను బట్టి వ్యాపారులు దోచుకుంటున్నారనే ఆరోపణలు విమర్శలు వెలువెత్తుతున్నాయి.

తనిఖీలు చేస్తాం: డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హరి కుమారి.

ఇటుక బట్టీల పరిశ్రమలో యజమానులు బాల కార్మికులతో పనులు చేయిస్తున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఆకస్మికంగా తనిఖీలు చేస్తాం. బట్టీలలో బాల కార్మికులను గుర్తించి వారిని అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి సేవలందిస్తాం. గతంలో కూడా ఇటుక బట్టీల యజమానులు బాల కార్మికులతో పనిచేయిస్తే వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఇదిలా ఉండగా బాల కార్మికులతో పనిచేయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి స్వర్ణలత లెనినా కూడా స్పందించారు. తనిఖీలు చేసి బాలలను గుర్తించి వారి కోసం ప్రత్యేకంగా అంగన్వాడి సెంటర్ ఏర్పాటు చేయించి ప్రత్యేక సేవలందించడంతో పాటు సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.

# "ఇన్ఫోసిస్" నియామకాలలో వివిఐటి విద్యార్థినుల సత్తా



అమృత్ తెలంగాణ: మార్చ్ 6. పెదకాకాని ప్రముఖ ఐటి సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ నియామకాల కొరకు ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీతో కలసి ఇంజనీరింగ్ విదార్థినులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపిక నందు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 88మంది బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరచి ఉద్యోగ నియామకాలు పొందారని కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. గ్రామీణ నేపధ్యం గల బాలికలు అధికంగా ఈ నియామకాలు పొందడం సంతోషం కలిగించిందని తెలిపారు. కృష్ణ గుంటూరు ప్రాంతీయ పరిధిలో వివిఐటి విద్యార్థులు అధిక నియామకాలుపొందటం విశేషంఅని అన్నారు. నియామకాలు పొందిన విద్యార్థినులు 3.6 లక్షల నండి 9.5 లక్షల వార్షిక వేతనం సంస్థ కేటాయించినట్లు తెలిపారు. కళాశాలలోని ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని ఉద్యోగ నియామకాలు పొందేవిధంగా తొలి ఏడాది నుండే పరిశ్రమ అవసరాలకు తగట్టు అత్యాధునిక సాంకేతిక అంశాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

అనంతరం నియమకాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపల్ డా వై. మల్లిఖార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డా కె.గిరిబాబు, డీన్ ప్లేస్మెంట్ డా ఎమ్. వి.రఘురామ్, ఉపాధికల్పనా మరియు శిక్షణా విభాగాధిపతి డా యూ.మాధవ్, అధ్యాపకులు అభినందించారు.


# ఆసుపత్రి శతశాతము లక్ష్యం అధిగమించాలి : జిల్లా వైద్య అధికారి డాక్టర్ రవి కుమార్

కశింకోట (అనకాపల్లి) అమృత్ తెలంగాణ: మార్చ్ 6.అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను గురువారం అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమముల లక్ష్యాలు సమీక్షించి, రికార్డ్స్,రిపోర్ట్స్ పరిశీలించి శతశాతం సాధించాలని ఆదేశించారు . క్షేత్ర స్థాయి సిబ్బంది ఆధ్వర్యంలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రంలు శత శాతం లక్ష్యాలు సాధించాలని అన్నారు. పి.హెచ్.సి నందు వాక్సిన్ల కోల్డ్ చైన్ (సీతలికరణ) నిర్వహణను మందుల



స్టోర్స్, రికార్డును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమం లో ఆరోగ్య విస్తరణ అధికారి ఏ.సుబ్బారావు, ఆరోగ్య బోధకులు ఎం. ఎస్. వి. ప్రసాద్, సిబ్బంది కె.ఎస్.ఆర్.కె.జి. నరసింహారావు, ఆర్. వెంకటలక్ష్మి ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# నల్ల కోకలో మిల్కీ సోయగాల వల



తనదైన అందం, రూపలావణ్యంతో రెండు దశాబ్ధాల కెరీర్ ని సునాయాసంగా లాగించేసింది తమన్నా. అసలే మిల్కీ అందం.. ఆపై కొంటె చూపుల బాణాలు విసురుతోంది. అలా ఏటవాలుగా వెనక్కి చూస్తూ, నల్ల కోక సొగసును, సన్నజాజి నడుమును ఆవిష్కరిస్తోంది. ఆల్ బ్లాక్ లో మిల్కీ షైనీ లుక్స్ మతులు చెడగొడుతున్నాయి. ప్రియుడు విజయ్ వర్మ నుంచి బ్రేకప్ అయిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో యూత్ ని డైవర్ట్ చేయడానికే ఈ ఫోటోషూట్ అని భావించాల్సి ఉంటుంది. తనదైన అందం, రూపలావణ్యంతో రెండు దశాబ్ధాల కెరీర్ ని సునాయాసంగా లాగించేసింది తమన్నా. జయాపజయాలతో సంబంధం లేకుండా వరుసగా అవకాశాలు అందుకునే ప్రతిభావనిగా నిరూపించుకుంది. మిల్కీ అందం ప్రస్తుతం తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో నటిస్తోంది. మూడు చోట్లా మూడు ముక్కలాటలో ఆరితేరిపోయింది. మరోవైపు వెబ్ సిరీస్ లలోను అవకాశాలు అందుకుంటూ ఓటీటీ క్వీన్ గా సత్తా చాటుతోంది. తమన్నా నటించిన ఓదెలా 2 విడుదలకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ సినిమాని ప్రమోట్ చేయడంలో తమన్నా స్పీడ్ గా ఉంది. ఇటీవలే టీజర్ విడుదలై ఆకట్టుకుంది. దైవ శక్తి గురించిన చిత్రం తమన్నా ఇటీవల ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో స్నానాదులు ఆచరించి, అనంతరం పూజల్లో తరించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. వీలున్న ప్రతి వేదికపైనా తమన్నా టీమ్ ఓదెలా 2 కి ప్రచారం కల్పిస్తోంది

# మేకపిల్లతో జాన్వీ పాప

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ RC16 పై భారీ అంచనాలున్నాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ RC16 పై భారీ అంచనాలున్నాయి. 'ఉప్పెన' లాంటి బ్లాక్బస్టర్ తర్వాత బుచ్చిబాబు, చరణ్ కోసం ఓ పవర్ఫుల్ కథను సిద్ధం చేశాడని టాక్. రూరల్ స్పోర్ట్స్ బ్యాక్డ్రాప్లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రామ్ చరణ్ కొత్త అవతారం లో కనిపించనున్నాడు. అలాగే, ఈ సినిమా చరణ్ కెరీర్లోనే భారీ బడ్జెట్తో తెరకెక్కుతున్న ప్రాజెక్ట్ కావడంతో, ఫ్యాన్స్ కాస్త ఊహకందని అంచనాలు పెంచుకున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన స్టార్ క్యాస్ట్ కూడా భారీగా ఉండనుందని తెలుస్తోంది. జాన్వీ కపూర్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, సినిమాటోగ్రఫీకి రత్నవేలు పనిచేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టైటిల్ ఎనౌన్స్మెంట్ రామ్ చరణ్ పుట్టినరోజు, మార్చి 27న ఉంటుందని టాక్. ఇక ఇవాళ బర్త్డే సందర్భంగా జాన్వీకి RC16 టీం ప్రత్యేకంగా విషెస్ చెప్పింది. సినిమా షూటింగ్ స్పాట్ లో కాకుండా, చేతిలో మేక పిల్లను పట్టుకొని ఉన్న స్టన్నింగ్ లుక్లో జాన్వీ ఉన్న ఫోటోని విడుదల చేశారు. ఆమె క్యూట్ ఎక్స్ప్రెషన్, ట్రెడిషనల్ లుక్ చూసిన అభిమానులు ఫిదా అయ్యారు. షూటింగ్ కి సంబంధం లేని ఈ లుక్ ని చూస్తే, జాన్వీ RC16 లో చాలా అందంగా అల్లరిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఎన్టీఆర్ దేవర లో నటించి బిగ్ హిట్ అందుకున్న జాన్వీ, ఇప్పుడు రామ్ చరణ్ సినిమాలోనూ అదే రేంజ్ లో మరో కమర్షియల్ హిట్ కొట్టాలని చూస్తోంది. దేవర లో ఆమె పాత్రకు అంతగా ప్రాధాన్యం లేకపోవడంతో, ఈసారి బుచ్చిబాబు సినిమా ద్వారా తనకు సరైన రోల్ దొరకాలని ఆశిస్తోంది. మెగా ఫ్యామిలీ అభిమానుల మధ్య మంచి క్రేజ్ ఉన్న ఈ ప్రాజెక్ట్, జాన్వీ కెరీర్ కు బిగ్




హిట్ అవుతుందో లేదో వేచి చూడాలి. అందులోనూ RC16 లో ఆమెది కథకు చాలా కీలకమైన పాత్ర అని టాక్. బుచ్చిబాబు గతంలో 'ఉప్పెన' సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ కి ఎంతటి ప్రాధాన్యం ఇచ్చాడో అందరికీ తెలిసిందే. ఆ స్పెషల్ టచ్ RC16 లోనూ కనిపిస్తే, జాన్వీ ఈ సినిమా ద్వారా తన నటన పరంగా కూడా కొత్త హైట్ ని అందుకోవచ్చు. అలాగే 'దేవర' లో వచ్చిన కామెంట్స్ని దృష్టిలో ఉంచుకొని, ఈ సినిమాలో ఆమె నటిగా మరింత మెచ్యూర్డ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇక జాన్వీ RC16 తో పాటు బాలీవుడ్ లో రెండు ప్రాజెక్టులు చేస్తోంది. అలాగే ఎన్టీఆర్ తో దేవర 2 కూడా లైన్ అప్ లో ఉందని సమాచారం. కానీ ఆ సినిమాకి సంబంధించి ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు. ఆఫీషియల్ ఎనౌన్స్ మెంట్ రావాల్సి ఉంది. అయితే RC16 కంటే ముందు ఆమె బాలీవుడ్ లో కూడా బిజీగా ఉంది. మరి మెగా హీరోతో ఈ బాలీవుడ్ బ్యూటీ కెరీర్ ఎంతటి మేజర్ బ్రేక్ అందుకుంటుందో చూడాలి.

# బలగం బ్యూటీ వెయిటింగ్ ఫర్ ఏ ఛాన్స్..!

బలగం తో పాపులారిటీ బాగా వచ్చినా అవి ఛాన్స్ ల రూపంలో మాత్రం మారాలేదు. బలగం తర్వాత అమ్మడు శ్రీ సింహాతో ఉస్తాద్ అనే సినిమా చేసింది. చైల్డ్ ఆర్టిస్ట్ గా చేసి హీరోయిన్ గా మారిన భామల్లో తెలుగు అమ్మాయి కావ్య కళ్యాణ్ రామ్ ఒకరు. చైల్డ్ ఆర్టిస్ట్ గా నటిస్తూ ఆడియన్స్ కు దగ్గరైన ఈ అమ్మడు మసూద సినిమాతో హీరోయిన్ గా టర్న్ తీసుకుంది. ఆ తర్వాత బలగం సినిమాతో ఆకట్టుకుంది. ప్రియదర్శికి జతగా బలగం సినిమాలో కావ్య నటనకు ఆడియన్స్ ఇంప్రెస్ అయ్యారు. బలగం తో పాపులారిటీ బాగా వచ్చినా అవి ఛాన్స్ ల రూపంలో మాత్రం మారాలేదు. బలగం తర్వాత అమ్మడు శ్రీ సిం హాతో ఉస్తాద్ అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా వర్క్ అవుట్ కాకపోయే సరికి కావ్యని ఎవరు పట్టించుకోవట్లేదు. ఐతే కావ్య మాత్రం సినిమా ఆఫర్లు లేకపోయినా ఆడియన్స్ ను తన ఫోటో షూట్స్ తో బుట్టలో వేసుకోవాలని చూస్తుంది. తనదైన శైలిలో రకరకాల ఫోటో షూట్స్ తో అలరిస్తుంది కావ్య కళ్యాణ్ రాం. కెరీర్ బిజీ చేసుకునే ప్లానింగ్ లో భాగంగానే అమ్మడు ఫోటో షూట్స్ తో ఎట్రాక్ట్ చేస్తుంది. ముఖ్యంగా తన క్యూట్ లుక్స్ తో కావ్య ఫాలోవర్స్ హృదయాలను మెలిపెట్టేలా చేస్తుంది. చైల్డ్ ఆర్టిస్ట్ గానే ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ అమ్మడు ఇప్పుడు హీరోయిన్ గా కూడా అదే ఫాం కొనసాగించాలని చూస్తుంది. ఐతే బలగం హిట్ తో కచ్చితంగా కావ్య కెరీర్ ఊపందుకుంటుందని అనుకోగా ఎందుకో అలా జరగలేదు. ఐతే కావ్య కూడా హడావిడిగా సినిమాలు చేసే ఉద్దేశం లేనట్టు ఉంది. అందుకే కెరీర్ గురించి పెద్దగా దిగులు పడకుండా వచ్చిన ఛాన్స్ లనే చేస్తూ వస్తుంది.




# దివ్య భారతి.. వయ్యారాల రోజా!



సౌత్ సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల భామ దివ్య భారతి తన లేటెస్ట్ ఫోటోషూట్తో నెట్టింట హీట్ పెంచేస్తోంది. సౌత్ సినిమా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల భామ దివ్య భారతి తన లేటెస్ట్ ఫోటోషూట్తో నెట్టింట హీట్ పెంచేస్తోంది. బ్యాచిలర్ సినిమాతో అమ్మడు ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. అయితే తాజాగా ఆమె షేర్ చేసిన ఈ స్టైలిష్ లుక్స్, ఎలిగెంట్ ఫ్యాషన్ సెన్స్ అభిమానులను కట్టిపడేస్తున్నాయి. అద్దిరిపోయే ఎక్స్ప్రెషన్స్, ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఈ ఫోటోలు నెటిజన్ల హృదయాలను దోచుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఆమె ధరించిన మేజెంటా కలర్ లేహంగా, ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత మెరుగుపరిచాయి. దివ్య భారతి ఫోటోషూట్లో కనిపించిన ఆ గ్రేస్, ఆమె గ్లామర్, మోడలింగ్ స్కిల్స్ ఓ కొత్త ట్రెండ్ సెట్టింగ్గా మారాయి. ఆమె ఫ్లోరిస్ట్ స్టైల్ జ్యువెలరీ, అట్రాక్టివ్ ఇయర్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. వీటికి తోడు ఆమె స్మైలింగ్ ఎక్స్ప్రెషన్.. ఆమె ఒదిగి ఉన్న కన్ఫిడెన్స్.. అభిమానులను మైమరపింపజేస్తున్నాయి. ప్రతి ఫోజ్లోనూ సొగసైన ప్రెజెంటేషన్ ఉన్న ఈ ఫోటోలు కేవలం గ్లామర్ కంటే క్లాస్ లుక్కి పెట్టింది పేరు అనేలా మారాయి. నేడు సోషల్ మీడియాలో టాప్ ట్రెండ్స్లో దివ్య భారతి తాజా ఫోటోలు కనిపిస్తున్నాయి. ఆమె వయ్యారాలు, ఆకర్షణీయమైన బాడీ లాంగ్వేజ్తో ఈ ఫోటోషూట్ మరింత హైలైట్ అయింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com